సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

శుక్రవారం । 3 । ఫిబ్రవరి । 2023



ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. 8లో



ఘనంగా శంకులమ్మతల్లి ఉత్సవం 8లో

గుడివాడలోని శంకులమ్మతల్లి జాతర గురువారం ఘనంగా ప్రారంభమైంది.



హెల్త్ వలంటీర్ల నియామకాలకు చర్యలు 8లో

హెల్త్ వలంటీర్ల నియామకానికి చర్యలు తీసుకుంటామని కుంభా రవిబాబు తెలిపారు.

న్యూస్‌రీల్

ఆర్థిక సాయం సద్వినియోగం చేసుకోండి

డ్వామా డిప్యూటీ కమిషనర్ భవాని



గ్రామ సభలో మాట్లాడుతున్న డ్వామా డిప్యూటీ కమిషనర్ భవాని

మారేడుమిల్లి: ప్రభుత్వం అందించే ఆర్థిక సాయాన్ని గిరిజన రైతులు సద్వినియోగం చేసుకోవాలని డ్వామా డిప్యూటీ కమిషనర్ సి.భవాని అన్నారు. మండలంలోని వేటుకూరు పంచాయతీ పరిధి పందిరిమామిడికోట గ్రామంలో గురువారం ఎంపీడీవో వీరకిషోర్ అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఈ సభలో ముఖ్యఅతిథిగా ఆమె మాట్లాడారు. ఎన్ఆర్‌జీఎస్, హార్టీకల్చర్‌కు సంబంధించి రబ్బరు, జాఫ్రా పంటలు గ్రామంలో ఎంతమంది వేశారు, ఆ తోటల వల్ల సంవత్సరానికి ఎంత ఆదాయం వస్తోందో అడిగి తెలుసుకున్నారు. ప్రతీ కుటుంబం 100 రోజుల ఉపాధి హామీ పనులు పూర్తి చేయాలని, ఎవరూ ఉపాధి పనులు మానకూడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ రమేష్ రామన్, పీహెచ్‌వో చిట్టిబాబు, ఏపీవోలు రెడ్డిబాబు, సాయిబాబు, ప్రకాష్, వేటుకూరు పంచాయతీ కార్యదర్శి వంశీ రాఘవ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న గోవా ముఖ్యమంత్రి



ప్రమోద్ సావంత్‌కి అప్పన్న జ్ఞాపికను అందజేస్తున్న ఈఈ శ్రీనివాసరాజు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని గురువారం గోవా ముఖ్యమంత్రి డాక్టర్ ప్రమోద్ సావంత్ దర్శించుకున్నారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద ఆయనకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఆలయంలోని కప్పస్తంభాన్ని మొక్కుకుని బేడామండపంలో ప్రదక్షిణ చేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని దేవస్థానం ఈఈ శ్రీనివాసరాజు అంజేశారు. గోవా పర్యాటకశాఖ మంత్రి రోహన్ కాంతే కూడా ముఖ్యమంత్రి వెంట ఉన్నారు.

4.3 కిలోల బరువుతో శిశువు జననం



అధిక బరువుతో పుట్టిన శిశువుతో డాక్టర్లు శ్రీదుర్గ, లిఖిత

రాజవొమ్మంగి: స్థానిక పీహెచ్‌సీలో గురువారం రాత్రి సంపూర్ణ ఆరోగ్యంతో 4.3 కిలోల బరువుతో ఆడశిశువు జన్మించింది. పురిటినొప్పులతో పీహెచ్‌సీకి వచ్చిన రాజవొమ్మంగికి చెందిన పెదిరెడ్ల శిరీషను పరీక్షించిన మెడికల్ ఆఫీసర్ శ్రీదుర్గ కాన్పు కష్టం అని భావించారు. అయితే సమయం లేకపోవడంతో ఆస్పత్రిలోనే స్కానింగ్ చేసి బిడ్డ పొజిషన్ బాగానే ఉందని భావించిన డాక్టర్ శ్రీదుర్గ కష్టమైనా ప్రసవం చేశారు. ఆమెకు మరో మెడికల్ ఆఫీసర్ లిఖిత సహాయం చేశారు. పండంటి ఆడబిడ్డ జన్మించగా, ఆ బిడ్డ బరువు 4.3 కిలోలు ఉండటం విశేషం. తల్లీబిడ్డను కాపాడిన డాక్టర్లను శిరీష కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

8న వలంటీర్ల నియామకానికి ఇంటర్వ్యూలు

చింతపల్లి: మండలంలోని ఎర్రబొమ్మలు, పెదబరడ పంచాయతీల్లో ఖాళీగా ఉన్న వలంటీర్ల నియామకాలకు ఈ నెల 8న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో లాలం సీతయ్య తెలిపారు. పెదబరడ పంచాయతీలో ఒకటి, ఎర్రబొమ్మల పంచాయతీలో మూడు ఖాళీలకు సంబంధించి దరఖాస్తులు ఆహ్వానించామని, ఇంటర్వ్యూలకు ఒరిజనల్ ధ్రువీకరణపత్రాలతో హాజరు కావాలని ఆయన కోరారు.

శత శాతం లక్ష్యం

- వెనుకబడిన టెన్త్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి
- ప్రతీ రోజూ అదనపు తరగతుల నిర్వహణ
- పిల్లల చదువుపై తల్లిదండ్రులకు కౌన్సెలింగ్
- ప్రతీ విద్యార్థికి జగనన్న విద్యాదీవెన స్టడీ మెటీరియల్ పంపిణీ



లాగరాయి హైస్కూల్లో తల్లిదండ్రులతో సమావేశం నిర్వహిస్తున్న హెచ్‌ఎం నూరారెడ్డి

రాజవొమ్మంగి: జిల్లాలో టెన్త్‌లో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యాశాఖ ప్రణాళిక రూపొందించింది. పదవ తరగతి పరీక్షలు దగ్గర పడుతుండడంతో వారి కోసం పాఠశాలలు, గురుకులాల్లో ప్రత్యేక అదనపు తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థినీ విద్యార్థుల్లో పరీక్షల భయాన్ని పోగొట్టేందుకు ఎప్పటికప్పుడు పూర్తయిన సిలబస్‌పై స్లిప్ టెస్టులు పెడుతున్నారు. ప్రభుత్వ స్కూళ్లు ప్రైవేటు స్కూళ్లకు దీటుగా పేరుతెచ్చుకొంటున్నాయి. మరో పక్క పదో తరగతి పిల్లల తల్లిదండ్రులతో పాఠశాల యాజమాన్యాలు సమావేశాలు ఏర్పాటు చేసి పిల్లల చదువు విషయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై కౌన్సెలింగ్ ఇస్తున్నాయి.

జిల్లాలో 11,582 మంది పరీక్షలకు సిద్ధం

జిల్లా వ్యాప్తంగా పది పరీక్షలకు 63 పరీక్షాకేంద్రాలు ఏర్పాటు చేసినట్టు డీఈవో రమేష్‌బాబు తెలిపారు. ఈ ఏడాది మొత్తం 11,582 మంది టెన్త్ పరీక్షలు రాస్తున్నారని పేర్కొన్నారు. ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.



రాజవొమ్మంగి గురుకులంలో ప్రత్యేక పరీక్షల నిర్వహణ

దాతలు అల్పాహారం ఏర్పాటు చేయాలి

పది పరీక్షలు రాసే విద్యార్థినీ విద్యార్థులకు సాయంత్రం ప్రత్యేక అదనపు తరగతులు నిర్వహిస్తున్నామని డీఈవో రమేష్ బాబు తెలిపారు. అయితే ఈ విధంగా సాయంత్రం ప్రత్యేక తరగతుల్లో చదువుకుంటున్న వారికి దాతలు ముందుకు వచ్చి అల్పాహారం ఏర్పాటు చేస్తే బాగుంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. గురుకులాలు, వసతి గృహాల్లో చదువుకునే పిల్లలకు సాయంత్రం స్నాక్స్ పంపిణీ ఉంటుందన్నారు. ఉన్నత పాఠశాలల్లో చదువుకుంటున్న వారికి అటువంటి ఏర్పాటు లేదు. దాతలు ఎవరైనా బిస్కెట్లు, టీ వంటి పదార్థాలను ఇస్తే పిల్లలకు మేలుచేసినవారు అవుతారన్నారు.

40 మందిపై చర్యలు

జిల్లా వ్యాప్తంగా విధినిర్వహణలో అలసత్వం వహించిన 40 మంది ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటూ నోటీసులు జారీ చేశామని డీఈవో రమేష్‌బాబు తెలిపారు. రాత పుస్తకాల కరెక్షన్, ప్రత్యేక తరగతులు నిర్వహించకపోవడం, సిలబస్ పూర్తిచేయకపోవడం తదితర తమ దృష్టికి వచ్చిన కొన్ని లోపాలపై చర్యలు తీసుకున్నట్టు డీఈవో రమేష్‌బాబు తెలిపారు.

స్టడీ మెటీరియల్ అందజేత

పదవ తరగతి విద్యార్థులు పబ్లిక్‌పరీక్షలకు సులువుగా ప్రిపేర్ అయ్యేందుకు ప్రభుత్వం స్టడీ మెటీరియల్‌ను ప్రతీ విద్యార్థికి అందజేసింది. జగనన్న విద్యాభారతి పేరుతో రూపొందించిన ఈ పుస్తకాలు ప్రజాప్రతినిధుల చేతులమీదుగా ఇప్పటికే విద్యార్థులకు చేరాయి.

మారిన ప్రశ్నాపత్రాలపై అవగాహన



ప్రభుత్వం ఈ ఏడాది పదవ తరగతి పరీక్షా విధానంలో కొన్ని మార్పులు తీసుక వచ్చింది. గతంలో ఒకే సబ్జెక్టుకు రెండు రోజుల పాటు, వన్, టూ పేపర్లు రాయాల్సి వచ్చేది. నూతన విధానంలో సైన్స్ మినహా మిగతా సబ్జెక్టులు ఒక్కొక్క పేపర్ మాత్రమే రాస్తే చాలు. గతంలో ఫిజికల్ సైన్స్, నేచురల్ సైన్స్ అంటూ రెండు పేపర్లు రెండు రోజులు రాసేవారు. ఇప్పుడు ఈ రెండు పేపర్లు ఒకే రోజు రాయాలి. ఉదయం 9.30 గంటలకు పీఎస్ పరీక్ష, ఓ గంట తరువాత ఎన్ఎస్ పేపరు రాయాలి. ఈ మార్పులపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం. తర్ఫీదు ఇస్తున్నాం.

– శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల,రాజవొమ్మంగి

నూరు శాతం ఫలితాలే లక్ష్యం



పది పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణతకోసం కృషి చేస్తున్నాం. ప్రస్తుతం ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం ఆయా సబ్జెక్టులపై స్పెషల్ టెస్టులు నిర్వహిస్తున్నాం. సాయంత్రం ప్రత్యేక అదనపు తరగతులు రాత్రి 7 గంటల నుంచి 10 వరకు నడుస్తున్నాయి. ఇప్పటికే సిలబస్ పూర్తికాగా పరీక్షలు రాసేందుకు వారికి ఉన్న సందేహాలను తీరుస్తున్నాం. చదువులో వెనుకబడిన వారిపై ప్రత్యేక దృష్టి పెట్టాం. గత ఏడాది 98 ఉత్తీర్ణత శాతం వచ్చింది. ఈ ఏడాది నూటికి నూరు శాతం సాధిస్తాం.

– సత్యవేణి, ప్రిన్సిపాల్, ఏపీ గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల

కొండలెక్కి.. తుప్పలు దాటి..

- నేరేడుబంద గ్రామాన్ని సందర్శించిన పాడేరు ఐటీడీఏ పీవో
- గిరిజనుల సమస్యలకు తక్షణ స్పందన
- స్కూల్ గోడలపై రేకుల ఏర్పాటుకు రూ.లక్ష మంజూరు
- ఉపాధి పనులు కల్పించాలని, విద్యాకానుక కిట్లు అందించాలని ఆదేశం



నేరేడుబంద చేరుకునేందుకు కొండలెక్కుతున్న పీవో, ఇతర అధికారులు



రచ్చబండపై గ్రామస్తులతో మాట్లాడుతున్న పీవో గోపాలకృష్ణ


రావికమతం: సుదూర కొండలపై ఉన్న ఆదివాసీ పల్లె అది. ఆ కుగ్రామంలో 60 కుటుంబాలున్నాయి. పదిమంది పిల్లలు సమీపంలోని అయిదు కిలోమీటర్ల దూరంలో ఉన్న పాఠశాలకు తుప్పలు, పొదల నడుమ నడిచి.. ఒకొక్కసారి గుర్రాలపై వెళ్తున్నారు. గిరిజన సంఘాల ప్రతినిధులు దీనిపై ఆందోళనలు చేయడం, ఇటీవల పత్రికల్లో రావడంతో పీవో గోపాలకృష్ణ స్పందించారు. రవాణా సదుపాయం లేని ఆ గ్రామానికి గురువారం కొండలు కోనలు ఎక్కి చేరుకున్నారు. అతి ప్రయాస పడి వచ్చిన ఆయనకు, అధికార్ల బృందానికి ఆ గ్రామ గిరిజనులు ఘన స్వాగతం పలికారు. గిరిజనులతో మమేకమైన పీవో వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పిల్లలు అడవిమార్గంలో నడిచి బడికి వెళ్తున్నారని, గ్రామంలో స్కూల్ ఏర్పాటు చేయాలని, ఇప్పటికే గోడలు నిర్మించామని తెలుపగా.. ఆ గోడలపై రేకుల ఏర్పాటుకు రూ.లక్ష మంజూరు చేశారు. వారి పిల్లలకు జగనన్న విద్యాకానుక కిట్లు అందలేదని తెలుపగా వాటిని వారం రోజుల్లోగా అందించాలని ఎంపీడీవో వెంకన్నబాబుకు ఆదేశించారు. ఉపాధి హామీ పథకం పనులు తమకు అందడం లేదని తెలియజేయగా తక్షణం వారికి పనులు కల్పించాలని జి.మాడుగుల, రావికమతం ఎంపీడీవోలకు ఆదేశించారు. పీవో పర్యటనలో తహసీల్దార్ మహేశ్వరరావు, చీమలపాడు సర్పంచ్ గంగరాజు, గిరిజన సంఘం నాయకులు గోవింద, అప్పారావు పలువురు పాల్గొన్నారు.

కేకే లైన్లో పట్టాలు తప్పిన గూడ్స్ రైలు



పట్టాలు తప్పిన గూడ్స్ వ్యాగన్లు.. ఒరిగిన విద్యుత్ స్తంభాలు

అనంతగిరి: కొత్తవలస–కిరండూల్ (కేకే) లైన్‌లో గూడ్సు రైలు పట్టాలు తప్పడంతో రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అనంతగిరి మండల పరిధిలో శివలింగపురం రైల్వేస్టేషన్ యార్డు 45వ కిలోమీటరు వద్ద గురువారం ఉదయం 6 గంటల సమయంలో విశాఖపట్నం నుంచి కిరండూల్ వెళుతున్న గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. 8 వ్యాగన్లు పట్టాలు తప్పడంతో ట్రాక్ బాగా తెబ్బతింది. ఓహెచ్‌సీ విద్యుత్ లైన్ తెగిపోవడంతోపాటు.. పట్టాలు తప్పిన బోగీలు ఢీకొట్టడంతో రెండు స్తంభాలు ధ్వంసమయ్యాయి. ఉదయం నుంచి కేకే లైన్‌లోని రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విశాఖ, కిరండూల్ నుంచి రావలసిన పాసింజర్ రైళ్లు, జగదల్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రద్దయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే రైల్వే సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని, యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ పనులు ప్రారంభించారు. గత నెలలో విశాఖపట్నం నుంచి కిరండూల్ వెళుతున్న పాసింజర్ రైలు శివలింగపురం రైల్వేస్టేషన్ యార్డులోనే పట్టాలు తప్పింది. అదే ప్రదేశంలో గురువారం గూడ్స్‌రైలు పట్టాలు తప్పిన ఘటన చోటు చేసుకుంది. శుక్రవారం మధ్యాహ్నానికి పునరుద్ధరణ పనులు పూర్తయ్యే అవకాశముంది. డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి సంఘటన స్థలానికి చేరుకొని పనులను పరిశీలించారు.



పాడేరు–చింతలవీధి రోడ్డులో పొగమంచు

కొనసాగుతున్న చలిగాలులు

సాక్షి,పాడేరు: జిల్లాలో చలిగాలుల తీవ్రత కొనసాగుతోంది. గురువారం చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 9.5 డిగ్రీలు, అరకులోయ కేంద్ర కాఫీబోర్డులో 10.2 డిగ్రీలు, పాడేరు మండలం మినుములూరు కేంద్ర కాఫీబోర్డులో 11 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కొన్ని చోట్ల పొగమంచు దట్టంగా కురిసింది. సాయంత్రం 6గంటల నుంచి చలిగాలులు తీవ్రంగా వీచాయి.

ఇద్దరు హెచ్‌ఎంలు, 8మంది టీచర్లకు షోకాజ్ నోటీసులు

పెదబయలు: మండలంలో ఇద్దరు హెచ్‌ఎంలు, ఎనిమిది మంది సబ్జెక్ట్ ఉపాధ్యాయులకు డీఈవో రమేష్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. పలు పాఠశాలలను గురువారం ఆయన సందర్శించారు. పెదబయలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల లెసన్ ప్లాన్‌ను పర్యవేక్షించకపోవడంతో ఆగ్రహించిన ఆయన హెచ్‌ఎం కృష్ణవేణికి, లెసన్ ప్లాన్ అసంపూర్తిగా ఉండడంతో ఇదే పాఠశాలకు చెందిన ఫిజికల్ సైన్స్ టీచర్ బాబూరావుకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల–2లో హెచ్‌ఎం లెసన్ ప్లాన్‌ను పర్యవేక్షించకపోవడం, ఉపాధ్యాయుల లెసన్ ప్లాన్ అసంపూర్తిగా ఉండడంతో హెచ్‌ఎం మూర్తి, మరో ఏడు గురు సబ్జెక్ట్ టీచర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

కచ్చితంగా వర్డ్ లెర్నింగ్ ప్రోగ్రాం పాటించాలి

ఉపాధ్యాయులు వర్డ్ లెర్నింగ్ ప్రోగ్రాంను కచ్చితంగా పాటించాలని, విద్యార్థుల సామర్థ్యాల పెంపునకు కృషి చేయాలని డీఈవో రమేష్ సూచించారు. పాఠశాలల సందర్శనలో భాగంగా పెదబయలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి, అసంతృప్తి వ్యక్తం చేశారు. సీతగుంట ఎంపీ ఎలిమెంటరీ పాఠశాలలో విద్యార్థుల నుంచి సమాధానాలు రాబట్టారు. పెదబయలు గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల–2, ఆశ్రమ బాలికల పాఠశాల–1, 2, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, కళాశాల, తురకలవలస గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. డీఈవో వెంట మండల విద్యాశాఖాధికారి కె.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.



పెదబయలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న డీఈవో

హెల్త్ వలంటీర్ల నియామకాలకు చర్యలు

రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ రవిబాబు

సాక్షి,పాడేరు: ఏజెన్సీలోని అన్ని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో హెల్త్ వలంటీర్ల నియామకానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ కుంభా రవిబాబు హామీ ఇచ్చారు. ప్రజా సంఘాల ఐక్య వేదిక నేత కూడా రాధాకృష్ణ ఆధ్వర్యంలో పలువురు నేతలు గురువారం పీఎంఆర్సీ భవనంలో ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను కలిసి గిరిజన విద్యాలయాల్లో సమస్యలపై వినతి పత్రం అందజేశారు. గిరిజన విద్యార్థులు అనారోగ్యంతో మృతి చెందారని, దీనిపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారించాలని, ఐటీడీఏ పీవో గిరిజనులను చిన్నచూపు చూస్తున్నారని, ఆయన్ను బదిలీ చేయాలని, నిబంధనలకు విరుద్ధంగా చేసి డిప్యుటేషన్లు రద్దు చేయాలని కోరారు. వీటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని ఈ సందర్భంగా డాక్టర్ రవిబాబు హామీ ఇచ్చారు. ప్రభుత్వం గిరిజన విద్యకు అధిక ప్రాధాన్యమిస్తుందన్నారు. ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ టి.నరసింగరావు, ఎస్టీ కమిషన్ సభ్యురాలు కొర్రా రామలక్ష్మి, మాజీ ఎంపీపీ ఎస్.వి.వి.రమణమూర్తి, వైఎస్సార్‌సీపీ నేత జల్లిపల్లి సుభద్ర, మాజీ జెడ్పీటీసీ కొర్రా కాసులమ్మ, ఐక్య వేదిక నాయకులు లతాకుమారి, లక్ష్మణరావు, లక్ష్మి పాల్గొన్నారు.

జిల్లా వ్యవసాయ అధికారుల సంఘం కార్యవర్గం



జిల్లా వ్యవసాయ అధికారుల సంఘం నూతన కార్యవర్గం

సాక్షి,పాడేరు: జిల్లా వ్యవసాయ అధికారుల సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం ఎంపిక చేశారు.రాష్ట్ర వ్యవసాయ అధికారుల సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ బి.విజయ్‌ప్రసాద్, ప్రధాన కార్యదర్శి డి.ప్రవీణ్,జిల్లా వ్యవసాయాధికారి ఎస్.బి.ఎస్.నందు సమక్షంలో నూతన కార్యవర్గాన్ని గురువారం ఏర్పాటు చేశారు. వ్యవసాయాధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా రంపచోడవరం ఏడీఏ డాక్టర్ సి.హెచ్.కె.వి.చౌదరి, ఉపాధ్యక్షుడిగా జీకే వీధి ఏవో డాక్టర్ టి.మధుసూధన్ రావు, ప్రధాన కార్యదర్శిగా జి.మాడుగుల ఏవో ఎల్.ఆర్.బి.పాత్రుడు,సహాయ కార్యదర్శులుగా రంపచోడవరం ఏవో లక్ష్మణరావు,అడ్డతీగల ఏవో సువర్ణకుమారి,కోశాధికారిగా ముంచంగిపుట్టు ఏవో పి.మోహనరావుతో పాటు మరికొంతమంది అధికారులను సభ్యులుగాను నియమించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి విశాఖ జిల్లా వ్యవసాయాధికారులతో పాటు మన్యంపార్వతీపురం జిల్లాలోని ప్రతినిధులు పాల్గొన్నారు.

కోడిపుంజుల వేలంలో రూ. 24 వేల ఆదాయం

చింతూరు: వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న కోడిపుంజులకు స్థానిక పోలీసు స్టేషన్లో గురువారం వేలం పాట నిర్వహించారు. 15 పుంజులను వేలం వేయగా, రూ. 24,900 ఆదాయం వచ్చినట్లు ఎస్ఐ యాదగిరి తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన మాంసం ప్రియులు, ఆటోడ్రైవర్లు వేలం పాటలో పాల్గొని కోడి పుంజులను దక్కించుకున్నారు.

క్రమశిక్షణతో యువతకు ఉజ్వల భవిత



జూనియర్స్ విభాగంలో రన్నర్స్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజ్ జట్టు



జూనియర్స్ విభాగంలో విన్నర్స్ సాయి గణపతి పాలిటెక్నిక్ కాలేజ్ జట్టు



సీనియర్స్ విభాగంలో రన్నర్స్ దాడి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ జట్టు



సీనియర్స్ విభాగంలో విన్నర్స్ ఎన్ఎస్ఆర్ఐటీ కాలేజ్ జట్టు

- శక్తి, సామర్థ్యాలను విద్య, ఆటల కోసం వినియోగించాలి
- సాక్షి ప్రీమియర్ లీగ్ ముగింపు కార్యక్రమంలో సీపీ శ్రీకాంత్
- జూనియర్స్, సీనియర్స్ విభాగంలో విజేతలకు ట్రోఫీలు అందజేత

దొండపర్తి (విశాఖ దక్షిణ): యువత తమ శక్తి, సామర్థ్యాలను విద్య, ఆటల కోసం వినియోగించడం ద్వారా క్రమశిక్షణతో ఉజ్వల భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోగలుగుతారని నగర పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ అన్నారు. ఏయూ గోల్డెన్ జూబ్లీ మైదానంలో గురువారం జరిగిన 'సాక్షి ప్రీమియర్ లీగ్' క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు కూడా ముఖ్యమన్నారు. విద్య జ్ఞానాన్ని అందిస్తే... ఆటలు శారీరక దృఢత్వం, ఏకాగ్రత, నాయకత్వం, ఆత్మవిశ్వాసం, నీతి, విలువలు వంటి జీవిత నైపుణ్యాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. భౌతిక ప్రయోజనాలతోపాటు సామాజిక, వ్యక్తిత్వ వికాసానికి బాటలు వేస్తాయన్నారు. 'సాక్షి ప్రీమియర్ లీగ్' ద్వారా జిల్లాలో ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్, పీజీ కాలేజీల మధ్య క్రికెట్ పోటీలు నిర్వహించిన సాక్షి మీడియా గ్రూప్‌ను అభినందించారు. వీడీసీఏ అంపైర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జోగారావు మాట్లాడుతూ విద్యార్థులు తమ జీవితంలో లక్ష్యాలను సాధించడానికే కాకుండా ఆరోగ్యవంతమైన జీవనానికి క్రీడలు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులుగా ఎదగాలంటే విద్యార్థి దశ నుంచే ప్రణాళికాబద్ధమైన నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని సూచించారు.

విజేతలకు సీపీ శ్రీకాంత్ ట్రోఫీలు

సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో సీఎంఆర్ షాపింగ్ మాల్ స్పాన్సర్‌గా వ్యవహరించిన ఈ టోర్నమెంట్‌లో జూనియర్స్ విభాగంలో సాయి గణపతి పాలిటెక్నిక్ కాలేజ్ (గిడిజాల) విన్నర్‌గా నిలవగా... ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజ్(కంచరపాలెం) రన్నరప్‌గా నిలిచింది. అలాగే సీనియర్స్ విభాగంలో ఎన్ఎస్ఆర్ఐటీ కాలేజ్ (శొంఠ్యాం) ట్రోఫీని కైవసం చేసుకుంది. దాడి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ రన్నరప్ స్థానాన్ని దక్కించుకుంది. విన్నర్, రన్నర్ జట్లకు నగర పోలీస్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ చేతుల మీదుగా ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో సాక్షి అడ్వర్టైజ్‌మెంట్ డీజీఎం శ్రీనివాస్, సాక్షి ఛానల్ విశాఖ కరస్పాండెంట్ రామచంద్రరావు పాల్గొన్నారు.

విజేతగా సాయి గణపతి పాలిటెక్నిక్ కాలేజ్

జూనియర్స్ విభాగంలో ఉదయం జరిగిన ఫైనల్స్ పోరులో సాయి గణపతి పాలిటెక్నిక్ కాలేజ్ (గిడిజాల) 27 పరుగుల తేడాతో ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల (కంచరపాలెం)పై విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ చేపట్టిన సాయి గణపతి పాలిటెక్నికల్ కాలేజ్ నిర్ణీత 10 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 72 పరుగులు చేసింది. తనిష్క్ 20 బంతుల్లో 2 ఫోర్లతో 28 పరుగులు, నూకేష్ 17 పరుగులు చేశారు. 73 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజ్ జట్టు 46 పరుగులకే కుప్పకూలిపోయింది. దుర్గ 15, గణేష్ 11 పరుగులు చేశారు. కుమార్ 5 వికెట్లు తీసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. అలాగే లోకేష్ 2, తేజ 1 వికెట్ తీశారు.

ట్రోఫీ గెలుచుకున్న ఎన్ఎస్ఆర్ఐటీ

సీనియర్స్ విభాగంలో మధ్యాహ్నం జరిగిన ఫైనల్స్‌లో దాడి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (అనకాపల్లి) జట్టుపై 24 పరుగుల తేడాతో ఎన్ఎస్ఆర్ఐటీ కాలేజ్ (శొంఠ్యాం) జట్టు ఘన విజయం సాధించింది. టాస్ గెలిచిన దాడి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ జట్టు బౌలింగ్ ఎంచుకుంది.

దీంతో తొలుత బ్యాటింగ్ చేపట్టిన ఎన్ఎస్ఆర్ఐటీ కాలేజ్ నిర్ణీత 10 ఓవర్లలో 3 వికెట్లు నష్టపోయి 91 పరుగుల భారీ స్కోరు చేసింది. సీహెచ్.మోహన్ వాసుకిరణ్ 24 బంతుల్లో 1 సిక్స్, 6 ఫోర్లతో 46 పరుగులు, ఎల్.తేజ్‌తరుణ్ 2 సిక్సులతో 20, వి.సునీల్ 2 ఫోర్లతో 13 పరుగులు చేశారు. అనంతరం 91 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన దాడి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ జట్టు 10 ఓవర్లలో 5 వికెట్లు నష్టపోయి కేవలం 67 పరుగులు మాత్రమే చేయగలిగింది. చైతన్య 20, కుమార్ 17, కె.ప్రసాద్ 12 పరుగులు చేశారు. జి.సాయికుమార్ 2, వి.మణివరప్రసాద్ 2, సి.హెచ్.మోహన్ వాసుకిరణ్ 1 వికెట్ తీశారు.

ఘనంగా శంకులమ్మతల్లి ఉత్సవం

సాక్షి,పాడేరు: గుడివాడలోని గిరిజనుల ఆరాధ్యదైవం శంకులమ్మతల్లి రెండు రోజుల జాతర గురువారం ఘనంగా ప్రారంభమైంది. గ్రామచావిడిలోని శంకులమ్మతల్లి ఆలయంలో గిరిజన పెద్దలంతా వేకువజామునే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు ఫణిశర్మ అమ్మవారి ఉత్సవ విగ్రహానికి కుంకుమార్చన చేశారు. పాడేరు పట్టణంలోని అన్నివర్గాల ప్రజలు శంకులమ్మతల్లిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ప్రతినిధి బిమ్మలపూజారి సింహాచలం లోక కల్యాణార్థం హోమం నిర్వహించారు. సాయంత్రం నుంచి శంకులమ్మతల్లి ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో కొలువుదీర్చి పాడేరు పట్టణంలో రాత్రి వరకు ఊరేగించారు. సారె ఊరేగించి అమ్మవారికి సమర్పించారు. గిరిజనుల వాయిద్యాలు, థింసా నృత్యాల హోరులో ఊరేగింపు సంబరం ఘనంగా జరిగింది. మాజీ ఎంపీపీ వర్తన ముత్యాలమ్మ, వైస్ ఎంపీపీ గంగపూజారి శివ, మాజీ సర్పంచ్ పిన్నయ్యదొర, వైఎస్సార్‌సీపీ నాయకులు బొనంగి రమణ, పద్మ, నవీన్, గ్రామపెద్దలు కొట్టగుళ్లి సుబ్బారావు, కొట్టగుళ్లి రామారావు, గణేష్,అప్పలకొండ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



సదస్సుకు హాజరైన పార్టీ శ్రేణులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

అరకులోయ రూరల్: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. అరకులోయ క్యాంప్ కార్యాలయం ఆవరణలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి 50 కుటుంబాలకు ఒక గ్రామ వలంటీరు ఉంటే, వారితోపాటు సమన్యాయంగా పని చేసేందుకు ఇద్దరు చొప్పున గృహ సారధులు, సచివాలయ కన్వీనర్లను నియమించారన్నారు. గ్రామస్థాయిలో ప్రభుత్వ కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రధాన భూమిక పోషించాలన్నారు. భవిష్యత్తులో ఎప్పుడు ఎన్నికలు వచ్చిన సమష్టిగా పనిచేయాలని సూచించారు. గత ప్రభుత్వాలు ఏనాడూ చేయని అభివృద్ధి, సంక్షేమ పథకాలు సీఎం జగన్ చేసి చూపిస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి చెట్టి వినయ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఇచ్చిన మాటకు కట్టుబడి పాలన అందిస్తున్నారని ప్రశంసించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి జర్సింగ్ సూర్యనారాయణ, మైనార్టీ సెల్ జిల్లా కార్యదర్శి యాసిన్, డీసీ సెల్ కార్యదర్శి నరసింగరావు, ఎంపీపీ ఉషారాణి, మండల కన్వీనర్ పట్టాసి సంపత్‌కుమార్, వైస్ ఎంపీపీ రామన్న, ఏఎంసీ చైర్మన్ రాజారమేష్, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి హస్తినకుమార్, పార్టీ సీనియర్ నాయకులు శెట్టి అప్పాలు, రఘునాథ్, బాబూరావు, గురుమూర్తి, రాధ, సుంద్ర, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

Education

SPOKEN ENGLISH

- Join Spoken English and Grammar Classes. Offline & Online Classes will be Conducted. Meena's Institute, Vizag. Ramatalkies area. Ph : 88972 20659 [V- 1720]

Real Estate

HOUSE FOR SALE

- పాయకరావుపేట మండలం, శ్రీరాంపురం మెట్ట, అంబేద్కర్ విగ్రహం దగ్గర, డో.నెం. 4-43లో గల 174.80 చ॥గ॥లలో గల రెండు అంతస్థుల ఇండివిడ్యువల్ బిల్డింగ్ అమ్మబడును. ఫోన్ : 99664 40843, 99664 40636 [R-1234325]

PLOT FOR SALE

- లంకెలపాలెం జంక్షన్ – గాజువాక రోడ్‌లో హైవే ఫేసింగ్‌లో 435 గజాలు (9 సెంట్లు) హోటల్స్, షాపింగ్ కాంప్లెక్స్ మొదలగు వాటికి కమర్షియల్ స్థలం అమ్మబడును. ఫోన్ : 70139 35467 [V- 10122]
- దువ్వాడకి 9 కి.మీ లో 150, 200, 300 గజాలు 10 బిట్లు గలవు. గజం 5 వేలు, ఉడా బిట్లు గజం 7 వేలు, డైరెక్ట్ పార్టీ. ఫోన్ : 73864 14017 [V- 778229]

Services

ఆయుర్వేదం

- బొల్లి, తెల్లమచ్చలు, సోరియాసిస్‌లకు ఎటువంటి పత్యం లేని చికిత్స కలదు. మందులు ఉచితముగా ఇవ్వబడను. సంప్ర: 9603055647, 7995392747 [G-932]

OLD AGE HOME

- డా॥ రాధిక గోల్డ్ ఏజ్ హోమ్స్ : వృద్ధులకు, మంచాన ఉన్నవారికి వైద్యచికిత్స, 24 గంటలు డాక్టర్స్, నర్సస్, ఆయా, వసతి మరియు భోజన సదుపాయం. గోపాలపట్నం- విశాఖ. ఫోన్ : 93921 74471 / 72 [V- 1719]

Wanted

- ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉండి, పార్ట్ / ఫుల్ టైమ్ గా వర్క్ చేస్తూ ప్రతి రోజూ రూ. 500 నుండి రూ. 600 వరకు సంపాదించే అవకాశం. డైలీ పేమెంట్స్. సంప్ర : 9985782069. [A-336]
- ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-779873]
- రైల్వే స్టేషన్‌లో హౌస్ కీపింగ్ బాయ్స్, క్లీనింగ్ వర్కర్స్, H.R. సూపర్‌వైజర్ కావలెను. జీతం : 10 వేలు + 5 లక్షల ఇన్సూరెన్స్. RSR Vizag. : 77029 59468 [V- 714]
- Wanted Marketing Executive Exp. 5 Years & Office Boys, Driver Exp. 7 Years Receptionist cum Accountant Office : Near Jagadamba. Ph : 90323 25999 [V- 10123]
- SPENCER'S HYPER MARKET VIZAG Full Time Employees with Excelent Career Growth. Qlf : 10th + Age : 18 to 40yrs. Cont : 81870 98099, 85199 34699 [V- 776984]
- ప్రముఖ సంస్థలో Building Meterial Division లో పనిచేయుటకు నిరుద్యోగులకు మంచి అవకాశము. వివరాలకు సంప్రదింపవలెను. ఫోన్ : 97013 18233 [V- 780463]
- రామాటాకీస్ ఏరియాలో గల ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూట్‌లో పనిచేయుటకు ఫిమేల్ ఆఫీస్ అసిస్టెంట్ కావలెను. వయస్సు : 30సం॥ లోపు. రామాటాకీస్ ఏరియా. ఫోన్ : 73862 63237 [V-1721]
- ప్రముఖ సంస్థలో పనిచేయుటకు జనరల్ మేనేజర్స్ (M/F) కావలెను. అర్హత : MBA, MCA, ఆకర్షణీయమైన జీతం. సంప్రదించండి : లత : 99491 29054, 89197 52138 [V-1751]
- RBL CREDIT CARDS AGENCY నందు పని చేయుటకు Recovery Executives కావలెను. జీతం + అలవెన్స్ 15 వేలు. Contact : 79816 57599, 89190 11907. [NA-5318]
- ప్రముఖ కంపెనీకి మీ ఇంటి వద్దనే ఉండి పార్ట్‌టైం 1గం॥ పోస్టల్ కవర్స్‌పై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ కలవు. కాల్/వాట్సప్. 9704987227 [G-779879]
- ఈవెంట్ మెనేజ్‌మెంట్ లో వర్క్ చేయడానికి ఫీమేల్ స్టాఫ్ అ.కా.ను. జీ. 25K to 39K ఇంట్రెస్టెడ్ ఉన్నవారు రెస్యూమ్ పంపండి వాట్సాప్ 6281159171. [HA-28601]
- త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకోనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీవసతి + భోజనం, జీ: 16K ఎజెంట్ కమీషన్ 3K. ఫోన్: 7569955551, 9848571888. [H-786829]
- ప్రముఖ రియల్‌ఎస్టేట్ సంస్థ J.Group కంపెనీ హైదరాబాద్‌లో పని చేయుటకు ఉత్సాహవంతమైన యువకులు కావలెను. Age: 18 to 30, సాలరీ: 14,000 to 40,000/- + కమీషన్. Qualification: 10th, ఇంటర్, డిగ్రీ. ఫోన్: 9666688883. [HA-718]
- ప్రవేట్ మినీ బ్యాంకులలో పనిచేయుటకు అనుభవంగల సెక్యూరిటీగార్డ్స్ కావలెను. స్థలం: విశాఖపట్నం, రైల్వే న్యూ కాలనీ, సంప్ర: సెల్: 9704013331 [W-775778]
- మహీంద్రా: చోడవరం, పాడేరు, అరకు, విశాఖపట్నం, గాజువాక ఏరియాలలో మహీంద్రా ట్రాక్టర్స్‌ను మార్కెట్ చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. (ఇంటర్/డిగ్రీ పాటుగా రూరల్ ఏరియాలో మార్కెటింగ్ చేసిన అనుభవం) ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. ఇంటర్వ్యూ : శ్రీ గోపాల్ ఆటోమోటివ్ లిమిటెడ్, అనకాపల్లి, ✆ : 80085 77055, 99639 13366 [R-15434]
- మహీంద్రా ట్రాక్టర్ షోరూమ్ నందు పని చేయుటకు ఆఫీస్ ఇన్చార్జి కావలెను. డిగ్రీ చదివి, MS ఆఫీస్‌తో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం, కనీసం 2 సంవత్సరముల అనుభవం కలిగినవారు సంప్రదించండి. శ్రీ గోపాల్ ఆటోమోటివ్ లిమిటెడ్ నర్సీపట్నం. సెల్:80085 77055, 99639 13366 [R-15436]
- మహీంద్రా ట్రాక్టర్ షోరూమ్ నందు వర్క్ షాప్ సూపర్వైజర్‌గా పనిచేయుటకు డిప్లమా చదివి కనీసం ఒక సంవత్సరం అనుభవం కలిగిన వారు కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును: సంప్రదించండి శ్రీ గోపాల్ ఆటోమోటివ్ లిమిటెడ్ అనకాపల్లి. ✆ : 80085 77055, 99639 13366 [R-15435]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

భర్త వేధింపులపై కేసు నమోదు

వై.రామవరం: మండలంలోని కోట గ్రామానికి చెందిన చిలకల తాతారావు(42)పై గురువారం స్థానిక పోలీసు స్టేషన్‌లో సెక్షన్ 354/ఎ ప్రకారం కేసు నమోదు చేశారు. ఈ నెల 1న నిందితుడు తాతారావు తన రెండో భార్యను చితకబాది, ఆమె కుమార్తె పట్ల అసభ్యంగా ప్రవర్తించాడనే ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం. సంతోష్ కుమార్ తెలిపారు. గాయపడ్డ తల్లికుమార్తెలను రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలించామన్నారు.

జాతీయ త్రోబాల్ పోటీలకు పెదబయలు విద్యార్థి



మత్స్యరాజును అభినందిస్తున్న ప్రిన్సిపాల్

పెదబయలు: కర్నూలులో గత నెల 27 నుంచి 29వ తేదీ వరకు జరిగిన రాష్ట్ర స్థాయి అండర్–14 త్రోబాల్ పోటీల్లో విజయం సాధించి జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థి జర్త మత్స్యరాజు ఎంపికయ్యారని స్థానిక ఎస్టీ ఆన్స్ పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ షార గురువారం తెలిపారు. పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న విద్యార్థిని, వ్యాయామ ఉపాధ్యాయుడు రాజును అభినందించారు.

కారు ఢీకొని అంధురాలికి తీవ్రగాయాలు

చింతూరు: మండలంలోని వీరాపురం వద్ద గురువారం గుర్తు తెలియని కారు ఢీకొన్న ఘటనలో వీఆర్‌పురం మండలం కుంజవారి గూడేనికి చెందిన రవ్వ దేశమ్మ అనే అంధురాలు తీవ్రంగా గాయపడింది. దేశమ్మ వీరాపురంలోని తన బంధువుల ఇంటికి వచ్చిన క్రమంలో రహదారి పక్కనే నిలబడి వుండగా ఛత్తీస్‌గఢ్ నుండి తెలంగాణ వైపుకు వెళుతున్న కారు బలంగా ఢీకొని ఆగకుండా వెళ్లిపోయింది. ఈ ఘటనలో తీవ్ర గాయాలైన దేశమ్మను 108 ద్వారా స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం భద్రాచలం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యాదగిరి తెలిపారు.

గిరిజనుడికి ఏయూ డాక్టరేట్



వీసీ ప్రసాద్‌రెడ్డి నుంచి డాక్టరేట్ పట్టా అందుకుంటున్న రాజ్‌కుమార్‌రెడ్డి

మారేడుమిల్లి: మండలంలోని చావడికోట పంచాయతీ బోడ్లంక గ్రామానికి చెందిన గిరిజనుడు పల్లాల రాజ్‌కుమార్ రెడ్డి డాక్టరేట్ పట్టా అందుకున్నాడు. విశాఖపట్నం ఆంధ్రా యూనివర్సిటీలో పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ చదువుతున్న అతడు 'పంచాయతీ రాజ్ సంస్థల్లో షెడ్యూల్ తెగల రాజకీయ భాగస్వామ్యం' అనే అంశంపై కేస్ స్టడీ తీసుకుని యూనివర్సిటీ రీసెర్చ్ డైరెక్టర్ అండ్ ప్రొఫెసర్లు పి. అరుణ్‌కుమార్, ప్రేమానందం సమక్షంలో పరిశోధన చేశారు. దీనికిగాను వర్సిటీ వీసీ ప్రసాద్ రెడ్డి నుంచి డాక్టరేట్ పట్టా పుచ్చుకున్నట్లు గురువారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

రాష్ట్రాభివృద్ధికి కేంద్రం కృషి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు



సమావేశంలో మాట్లాడుతున్న సోము వీర్రాజు

అరకులోయ రూరల్: రాష్ట్రాభివృద్ధిపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు తెలిపారు. గురువారం ఇక్కడ నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఇప్పటికే రూ.10 లక్షల కోట్లతో 5జీ సేవలకోసం 1000 ల్యాబ్‌లు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఇంటింటికీ తాగునీరు అందించేందుకు జల్‌జీవన్ మిషన్ ద్వారా రూ.70 వేల కోట్లను కేటాయించినట్టు తెలిపారు. సమాచార సాంకేతిక రంగం అభివృద్ధికి రూ.లక్షా 63 కోట్లు, పశుబీమా కోసం రూ.లక్షా 25 కోట్లు కేటాయించినట్టు చెప్పారు. మెడికల్ కళాశాల నిర్మాణానికి 60 శాతం నిధులు కేంద్ర ప్రభుత్వమే ఇచ్చిందన్నారు. రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వ సారథ్యంలో 30.50 లక్షల మంది విద్యార్థినుల కోసం ఏకలవ్య పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. 36వేల మంది నూతన ఉపాధ్యాయ సిబ్బందిని నియమిస్తున్నామని తెలిపారు. యువతీయువకులకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై గ్రామ స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పి.వి.ఎన్. మాధవ్, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ రెడ్డి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేణుగోపాల్,రాష్ట్ర కార్యదర్శి మఠం శాంతకుమారి, జిల్లా అధ్యక్షుడు పాంగి రాజారావు, నాయకులు ఆనంద్, రాంచందర్, భాస్కర్‌రావు, దేవదాస్, బలరాం, మూర్తి తదితరులు పాల్గొన్నారు.